Sree



— బల —

చింతామణి!



వి. టి. రాఘవాచార్యులు.



శ్రుతిధర్మ సంజీవనీ ముద్రాక్షరశాల, బెజవాడ.

1922

శ్రీ

విజ్ఞప్తి.

మ॥ రససిద్ధుల్ కవులన్న పల్కు కటా! వ్యర్థంబయ్యెఁగా నేఁడు, నీ
రస భావార్థక చిత్రకావ్యరచనా ప్రాగల్భ్యమే మెండయెన్
మసనంపుం బఠనీయరూపకములే మాకున్ మహాదృశ్యముల్!
వెస, దృశ్యంబభినేయ మందు రదియున్ వేయేల! నింద్యంబయ్యెన్॥

మ॥ యతియుం బ్రాసము లేలయన్నఁ గవిదోషాయత్తుఁడై డీకొనున్
సతతంబున్ దిగనాడు వ్యాకరణ శాస్త్రజ్ఞుండు తద్దోషముల్
తతవిధ్వస్త సమస్తలక్షణ గుణోదర్కంబు లౌ రూపక
ప్రతతిన్ జాలిదలంప నెక్కరుఁడు ధర్మజ్ఞుండు లేఁడయ్యెఁగా॥

ఆ. వె॥ కవిత నభ్యసించు కాలమంద రచింత్రు
బాలకవులు వారి భావములకుఁ
దగిననటులె వెసఁ బ్రదర్శింతు రయ్యవి
నాటకములు గావు కాటకములు॥



— బలే చింతామణి! —

1వ ప్రకరణము.

క॥ ప్రథమాంధ్ర ప్రకరణమఁట!
ప్రథమాన మహాకవి ప్రబంధమునఁట! హా!
శిథిలీకృత రసభావ గు
ణధురీణము; నాట్యలక్ష్మినగు భూషణమున్

'ప్రథమ ఆంధ్రప్రకరణము!' 'మహాకవి విరచితము!' లీలాశుక చరిత్రాత్మకము! ఆంధ్రలోక కర్ణామృతము! బలే చింతామణి!

'ప్రతిగృహమునందు ప్రతిధ్వనించుచున్నది!' 'అనేకులకు విటీవిటులకు పశ్చాత్తాపబీజ మంకురింపజేయుచున్నది!' మఱేమి కావలె? వ్యభిచారము నాశనముగుచున్నది! దేశోద్ధారణము సగమైనది! బలే చింతామణి!

కథానాయిక వేశ్య. ఇందలి యితివృత్తము (కథ) దాని సామర్థ్యము, చతురత, చిత్తవృత్తి మొదలగువాని మాహాత్మ్యము!

బలే చింతామణి! మేకపిల్లవలె పుట్టఁగనే గంతులిడుచు ఆంధ్రదేశమంతయుఁ జుట్టుముట్టినది! అందలి ధనము దోళ్లదోపుగా దోచివైచినది! ఆహా! అంతలో దేశమందు వ్యాపించినది! ఇంతలో నాట్యరంగ మలంకరించినది! శబాస్! నాటకసంఘములకు గూడ కావలసినంత ధనము!

వేశ్యాగృహము నాట్యరంగస్థలమున కెగఁబ్రాకినది! ఆమూలాగ్రముగ నయ్యది త్రవ్వి తలకెత్తఁబడినది. మఱేమి మిగిలినది. లోకులు ప్రత్యేకముగా వేశ్యాంగనలయింటి రహస్యములు తెలిసికొనఁ బ్రయాస పడనక్కరలేదు. వారిచరిత్రాంశముల యాథార్థ్యము అనుభవముచేతఁగూడఁ దెలిసికొనుటకు సానివాడలం జేరుటయే యవశిష్టము. అది యుఁ దీయచు నేయున్నది.

ఏ పదిమందితో గలసి ఈ రూపకమును ప్రదర్శించుచు ఆంధ్రదేశమంతయు సంచరింపవచ్చును. దీనిని వ్యాపింపఁజేయవచ్చును. దీనిసహాయమున నందలి 'పుణ్య - పణ్య - క్షేత్రముల'న్నియు దర్శింపవచ్చును. అశేషమైన ధన మార్జింపవచ్చును.

ఈ యూహాయెవ్వరికిని పొడమలేదు. కాని, ఏలూరు ఆంధ్రనాటక పరీక్షా సంఘమువారొక యెత్తెత్తిరి. "ఓచింతామణీ! నీవు చాలచక్కని రూపకమవు. నీకీడైన నాటకములు లేవు. నీకీర్తి ఆచంద్రార్కము దశదిశలయందును వ్యాపింపఁ జేయుదుము. మా కేసహాయము చేయుదువు" అనిరి. పుట్టిన యింటిని మెట్టిన రంగస్థలములను బాగు చేసినది. ఆశ్రయించినవారి నేమిచేయునో! క్రీగంటఁ జూచినది. అధరము గదలించినది. నొసలెగయవైచినది. హసించినది. వేశ్య. భావము తెలియలేదు. అభిప్రాయము గూఢ ముగ నేయున్నది. అబ్బ! కసువు పుట్టుచున్నది. "ఛీ! నీతో డెవరికి కావలయును" అనిరి.

కాంపిటేషను ప్రకటించిరి. క్రొత్తవారికి వల్లెవేయుటకైన తగిన కాలవ్యవధిలేదు. అయినను ఎట్లో ఎనిమిది దరఖాస్తులు సంపాదించిరి. కాని 11 పాత్రములలో నేడింటికి మాత్రమే పతకములు. మొత్తముమీద సంఘమున కొక 'కప్పు' పతకము లేడే యని కాబోలు, బందరు, బాలభారతి సంఘమువారు నామించి, పతకముల సంఖ్యతో, దరఖాస్తుల సంఖ్యను సమముగావించి, రూపకముయొక్కయు, ప్రదర్శనములయొక్కయు, పరీక్షాఫలితములయొక్కయు సారస్యమును సూచించిరి. ఈవిషయమును కార్యస్థానము వారు మిగిలిన నాటక సంఘములవారికి దెలిప, విస్మజలబది భయమునుడిపిరి.

అదిగో! ప్రదర్శనములు ప్రారంభమయినవి. కాంప్లిమెంటరీ టిక్కట్లు. శిఫారసు టిక్కట్లు. కంకరరాళ్ల టిక్కట్లు. బెజవాడ పౌరుల కుతూహలమును 'సూపతి మోతే హాలు రేకు కప్పుమీద ఢాం' 'ఢాం' అని మ్రోగినది.

జడ్జీల హాజరుపట్టీలయందలి అలస్యములతో విఘ్నేశ్వరపూజ ప్రారంభమైనది. కొన్ని హాజరుకాని గుఱుతులఁగూడ నున్నవి. సరే! పరీక్షాఫలితము లాపట్టీకి ననుసరించియే యుండుట సహజమేగదా!

ఇఁకఁ బ్రదర్శనములు! కొన్ని కంపెనీ డ్రామాలు. కొన్ని గొల్ల భాగవతములు. ఏడు ప్రదర్శనములు. సంఖ్య కుదిరినందునను జెప్పవలె. కాంప్లిమెంటరీ టిక్కట్లువారు గూడ ఈనిద్రాభంగమీశ్వరుఁడేల ప్రసాదించెనాయని విషాదమగ్నులైరి. వివిధ విధ రసభంగ పరిణామము. పరీక్షాప్రదర్శనములను భావమే స్ఫురింపలేదు. అందువలననే, గ్రంథ విమర్శనములు, ప్రదర్శనా విమర్శనములు అచ్చటనే ప్రారంభమైనవి. బందరు రామమోహన నాటకసంఘమునందు దామోదర పాత్రను ధరించిన నటుడు, తదితర ప్రదర్శనములను విమర్శించుచు 'వద్దురా బాబూ' అను నొక అనా గ్రంథమును ప్రచురించెను. [అప్పటికి ప్రదర్శనములన్నియు పూర్తియై పరీక్షాఫలితములు నిర్ణయింపబడ లేదు. చివరకీసంఘమువారికే చాలభాగము జయము లభించెను]

బలే చింతామణి.

2వ ప్రకరణము.

క॥ ఎంతదనో చింతలపై । పంతంబున మణినిజేర్చి పండితులెల్లన్
చింతామణి రచియింపని । శాంతము జపియింత్రు జనులు తస్సాగొయ్యా!

బలేచింతామణి యనుపేరగల యీపుస్తకము, ఈప్రకరణమును, ఇప్పటిప్రదర్శనా వైచిత్ర్యములను, నటుల చరిత్రాదికములను, స్థాలీపులాకన్యాయముగ విమర్శించుచున్నది.

ఈ రూపకమును గ్రంథకర్త ప్రకరణ మనుచుండెను. లక్షణము సమగ్రముగ ననుసరింపఁబడలేదు. పదియంకము లుండుట, ఇతివృత్తము కల్పితమగుట, మాత్రము కొంత క్రమభంగముతో సిద్ధించినవి! సంధులు, సంధ్యంగములు, విష్కంభాదులు యథాబుద్ధికల్పితములే యైనవి.

రసము. లక్షణనిర్ణేతలు శృంగారప్రాధాన్యమనిరి. కాని యిక్కాలపు రసజ్ఞతకు శృంగారము, 'కామము'గా నుండుటచేత, నయ్యది రంగము నెక్కి కాయలుదిని 'శాంత'మునకు చోటిచ్చివైచినది. కాన నిది శాంతరస ప్రధానమైన రూపకమైనది.

నాయకుఁడు ధీరశాంతుఁడు. మొదట గార్హస్థ్యమును కొంత శాంతిలో నెరపెనుగాని, చింతామణిచెంత, శృంగారరస సముద్రమునంబడి శాంతమును గోలుపోయి, భార్యా జనకుల పక్షమున ధీరుఁడయి వారు స్తుతింపగనే శాంతమూర్తియై చింతవెట్టు సన్న్యాసత్వము స్వీకరించి ధీరత్వమును గోలువడినాఁడు.

నాయిక వేశ్య. శృంగారరసమును 'శాఠ్యో' బలముతో నడపినది. శాంతరసమును కపటధర్మ చింతనముతోఁ గలిపి కొనసాగించినది. ఈ చింతనము వలననే యిది 'చింతామణి' యని పేరు వడసినది. బలే చింతామణి!

ఇందు పాత్రములు 11. ఈ విమర్శనము నాయకునితోఁ బ్రారంభము. నాయికతో సమాప్తి.

బిల్వమంగళుఁడు. ఏకులమువాఁడు? మహాపండితుఁడు, పరమనైష్ఠికుఁడు, నీతిమంతుఁడు, పర(స్త్రీ) పరాఙ్ముఖుఁడు. ఇవి యుత్తమపురుష లక్షణములు. వ్యాపార గోష్ఠి గలవాఁడు. ఇది సామాన్య లక్షణమే. (1) కాని ప్రస్తుతకాలమున నైష్ఠికత్వ మధికముగ ఏ యవలక్షణముల తోడనో బ్రాహ్మణత్వమునే యాశ్రయించి యుండె నందురు. కాన బ్రాహ్మణుఁడేయని తలఁపోయుదము. (2) సుబ్బిసెట్టి పంతులుగారని పిలచిన భవానీశంకరు దీక్షితో భోజనముచేసెను. (3) పంచాంగము మూసివారు నవ్వుచీరెలవలన వైదికుఁడనఁదోచెను దామోదరుఁడు వీనిభార్యకును, తండ్రికిని 'రిఫారం' ఉత్తరక్రియలు నెఱపినాఁడు. అందువలన బిల్వమంగళుఁడు బ్రాహ్మణుఁడే. అయిన వైదికుఁడా? నియోగియా? ఈప్రశ్న యేలయందురేమో. మీసములను గణించి చర్చిం

చుటకు. మఱచితిని. అందులకు చర్చయేల? ఈ చరిత్రము పూర్వకాలమునకుఁ జెందినదే యైనను, ఈకాలము ననుసరించియే చిత్రింపబడినదిగదా! అందుచే మీసముండినను దోసములేదు. అదిగాక క్రాపింగుగలిగి విగ్గులు ధరించెడు పురుషుల ముఖములు పాపటల చేత స్త్రీల ముఖములవలె గాన్పించుచుండును. ఆదోషము పరిహరించుటకు మీసములుండుటయే మంచిది. విగ్గులువాడని వారెట్లులైన నుండవచ్చును. [మఱియు నీవిగ్గుల వలన, నటులతలలు, కంబళిపురుగులు పట్టిన మునగచెట్లులవలె నుండును. ఈదోషమని వార్యమే] తరువాత బొట్టు. ఈదినములలో బొట్టుకళాహైన్యమును, కులగోత్ర ఖండనములు (తగవులు) కలిగించుచుండెడు గావున, లేకపోవుటయే శ్రేయస్కరము. ఇఁక కట్టును గుఱించి అనగా దుస్తులు, నెక్టయిలు, కాలర్లు, సిల్కు పట్టులు, సైకిలు కట్టులు, స్టాకింగులు అనువేషము మగవేషముకంటె పొడవైన బూట్సులు. తక్కినవాని గోల యేమిగాని జోగా! పాదరక్షలు వంటయింటనుగూడ ప్రత్యక్షము. తీయను కట్టరు తీపులచేతను. ప్రయోగములేని మార్గమునుసరింపవలయును. అనౌచిత్య మ అపాయెను. అవి దేశీయపు చెప్పులు కావుగదా! గావచ్చును. కాని పదవవాండ్రు అపవిత్రమని చెప్పులతో పడవ యెక్కనీయరు. పైల్వానులాకతమునవనే చెప్పులతో గోదాచెంతకు చేరనీయరు. అయిననేమి? ఈనటులకు సోడాషాపులు, సిగరెట్టు దుకాణములు, కాఫీహోటలులు, వంటపూటియిండ్లు, లంజ గుడిసెలు, నాటాయపు టంగళ్లు అన్నియు నొక్కటియేగదా. స్వేచ్ఛముగా నన్నిచోటుల దోమలవలె సరాగముగ సంచరింతురు.

“సీ॥ తమయింట్ల, నిఖిలరంగములందు నొకభంగి సమహితత్వంబున
జరుగువారు! పెద్దలపొడగన్న భృత్యులంబ్రైవశి దలచి ధీరులయి
యూనలిడువారు! కన్నుదోయికి నన్యకాంత లబ్ధంబైన నోరచూ
పులఁ దోగుచుండువారు! తల్లిదండ్రులను విత్తమ్ముల్ల నిల్లాండ్రను,
గొంచపుబుద్ధిఁ జింతించువారు!

గీ॥ సతులయెడఁ గాముకస్థితి జరుపువారు! దైవతములంచు సిగరెట్లఁ
దలచువారు! లీలలందును గొంకులు లేనివారు! కుటిల మర్యాదు
లైనట్టి నటులు నేఁడు॥”

[ఇట్టి నటులచేత నాలుగు కృష్ణకర్ణామృత శ్లోకముల చదివించుటయే యీ రూపకము నందలి విశేషము. ఇందులకు నటులు గ్రంథకర్తయెడల కృతజ్ఞతగలిగి యుండవలయును.]

కేవల చక్షురజ్ఞాన మాత్రపండితులైన యీ నటుల భావార్థ రసాదికముల ప్రదర్శనా కాశల మేమనవచ్చును. ఏవిద్యయు చాలకాలము వ్యయప్రయాసములకోర్చి సాధించినఁగాని, మానవునకు స్వాధీనముగుటలేదు. అహో! నటుల భాగ్యము. సర్వో

త్కృష్టకమైనవిద్య. విశ్వలీలాసిద్ధికి అనుగతమైన కళ. సులభముగ వశమగుచున్నది. గొంతెత్తి అమడలంగడు లేకమగునట్లు భావరాగతాళ శూన్యముగ పాడఁగల కంఠస్వరమునకు లోఁబడిపోయినదిగదా! దీనికిదగినట్లు యథేచ్ఛాకల్పితములై చిత్ర విచిత్ర పరిణామ దశలుగల, అవకతవకరస కుదిబద్ధములైన నాటకములు లభించుచుండినవి. వీరెల్లరును విద్యాభ్యాసము చేయఁజాలక రంగస్థలమును మార్చివేయుచున్నామని ప్రగల్భములాడెదరు. అది మార్చివేయుటకాదు. మాడ్చివేయుట యని భావింపనగును.

ఇది శాంతరస ప్రాధాన్యముగదా! ఆరసమెట్లు సృజింపఁబడెను? ఎట్లు పెంపఁబడెను? ఎట్లు సిద్ధిఁజెందింపఁబడెను? చూతము.

శాంతరసమునకు 'శంకరుల' లక్షణము 'మునిజనేశాంతం'. ఇచ్చటనో 'వేశ్యాగృహేశాంతం' బలేలక్షణము కుదిరినది. నిజమే సంపదలెల్ల నశింపఁగా, శరీరబలమెల్ల నమసిపోవఁగా, ఇంద్రియపటుత్వము తొలఁగిపోవఁగా, వేశ్యమాతలవలన గుక్కిన పేలుగాఁ గూర్చుండఁ బెట్టఁబడిన విటుల పాలయిన 'శాంత'రసమున కియ్యది దోషరహితమైన లక్షణమే. శాంతరసమునకు 'శమము' స్థాయీభావము. అనగా, పుట్టునాడము! విశ్రమించు నెలవు! లీనమయి సిద్ధిఁజెందుచోటు! 'శమము'నకు 'శమోనిరీహావస్థాయాం స్వాత్మవిశ్రమజంసుఖం' నిస్పృహాదశయందు తనఆత్మకు విరామసౌఖ్య మిచ్చునది శమము. ఇందు 'వ్యాపారభారము తనశిరమునఁబోల్చి పెద్దవాడైన తండ్రికి విరామ మిచ్చుట' శమమగుచున్నది. నిజమే! వేశ్యాగృహమందుఁజేరి ఇంద్రియములకు, ఆయురారోగ్యములకు, సకలసంపదలకు, సర్వధర్మములకు 'శాంతి' చెప్పుటకు వేశ్యాసంసర్గమే ముఖ్యము. అది సంసార ధర్మమునందు స్వతంత్రములేక చేకూరదు. ఆస్వాతంత్ర్యము తండ్రిగారిని మూలఁగూర్చుండఁ బెట్టినంగాని లభింపదు. శబాసు! ఇఁక నేమి! అభినవముగ భరతశాస్త్రమొకటి రచింపఁదలఁచుగలవారు దీని నాధారము జేసికొని కృతకృత్యులుగావచ్చును. అంత 'ప్రథమాంధ్ర ప్రకరణ' కర్తృత్వ గౌరవము వీరికి దక్కినట్లే 'ఆంధ్రనాట్యశాస్త్ర' నిర్మాణగౌరవము వారికిని సిద్ధింపగలదు. నాట్యకళాలక్ష్మికి ఈరూపకములు, ఈ రంగస్థలములు, ఈ నటులు జేరి మహాగౌరవము - పొఱపాటు - గౌరవము - ఆర్జించినకీర్తి ఆంధ్రలోకమునకు ప్రసాదింపవచ్చును. ఔరా! చింతామణీ! నీవు ప్రకరణమను పేర, ఆంధ్రనాటక లక్ష్మికి ఒకప్రక్క, 'వ్రణము' (అనగా పుండు)గా జన్మించితి వెంతదానవే.

3వ ప్ర క ర ణ ము.

ఆ. వె॥ గణికయింటి భావగరిమ ముమ్మగసశుద్ధి । పాకసిద్ధి శయ్యవైఖరియును
భువియు దివియు పవియు రవియు నెఱుంగరు । బిల్వమంగళ కవివిభుడు దక్క॥

ఇందీనాయకుఁ డెట్లు ప్రవర్తింపవలయును? తెరయెత్తఁగనే 'భార్య' యను వ్యక్తిని పొగడుచున్నాఁడు. దుష్టభార్యలను, ధూర్త భర్తలను విమర్శించుచున్నాడు. ఇం

కను శాంతరసబీజము నాటనేలేదు. అప్పుడే తనకు గలుగఁబోవు భార్యా విముఖత్వమును సూచించెను. అయిన నీవోమము భార్య యొనరించిన పతిస్తుతివలన తొలఁగిపోయినదిగాఁబోలు. ఈవిధముగా బీజస్థాపనమునకు గావలయు రంగశుద్ధి యైనది. వెంటనే తనవిటశేఖరత్వమును సూచించుచు విప్రవారాయణుని విటునిగా నొనరించెనని శుద్ధిభంగము గావించెను. [ఈ శుద్ధిభంగము, శాంతరసము శృంగారమువలన పొందెడు భంగపాటును సూచించునుగాబోలు] అంతట తనతండ్రికి విరామమిచ్చుట కుత్సాహము జూపుచు శాంతరస బీజమును స్థాపించినాఁడు. [ఉత్సాహము వీరరసమునకు స్థాయిభావము] ఇచ్చటనే పురాణగోష్ఠికి భంగము వాటిల్లినది.

నాలుగవ యంకమున. రసదోహదము ప్రారంభము. (పెంట గట్టుట, నీళ్లు పోయుట మొ॥) ఏ విధమున? వర్తకులకు నీతిగఱపుట. మైత్రియొక్క గొప్పదనమును పొగడుట. అదిగాక, ఉద్యానమున, చల్లనిగాలిలో, పూవుల గమగమల మధ్యను. తీరిక జూచుకొని సృష్టివిలాస స్మరణానురూపమైన భగవద్విచారము సేయుచున్నాఁడు. ఇవియేగదా శుద్ధిభంగమైన క్షేత్రమునందు నాటబడిన రసబీజము మొలక యెత్తుటకు దగిన రసాయనంపు టెరువులు. అంతలో ఓవ మాలనాటి మిత్రుఁడు భవానీశంకరుఁడు ప్రత్యక్షమైనాఁడు. 'ఓయి వైరిఫుల్లాయి? ఈ రంగ ముద్యానవనము. పరిస్థితులు శృంగార రసోచితములు. కావున చేయవలసినది భోగినీవిచారము' అని వానికుద్బోధించుటకు గాఁబోలును. అట్లే అచట చింతామణీ స్తోత్రపాఠ మొనరించెను. శృంగార రసబీజము నాటెను. ఆబీజము నీటఁబడిన శనగగింజవలె అప్పుడే మొలక యెత్తినది. 'నాకన్నులుకూడ నెరవుదీసికొనిపోక పోతివా' అని యె నందువలననే. అంత నాశాంతి రసమో! మేక వచ్చెను. తలత్రుంచి నమలివైచెను. ఆ మొలక మోడైపోయెను. అంత నిష్కంటకముగా శృంగార రసవల్లిక పెరిగి. దినక్రమముగా చింతామణీ బిల్వమంగళులను, నఖశిఖపర్యంతము నేకముగా జుట్టివైచినది. అందువలననే (1) దనపేరు దాని చిట్టాలో యెక్కినందులకు సంతోషించెను. (2) "చక్రవదనముల కణికయైన" ఆచింతామణి రచించిన సమస్యా శ్లోకములందు గల తప్పులను గుఱుతింపఁజాలక పోయెను. వ్యామోహితుఁడుగదా! ఎట్లు గుఱుతింపఁగలఁడు? (ఆశ్లోకములు చింతామణి ఘట్టమున విమర్శింపఁబడును) (3) 'నీవే నేను' 'నేనే నీవు'అను కపటసన్యాసుల యొక్కయు, వేదాంతుల యొక్కయు, 'శుద్ధ అభేద ప్రతిపత్తి' ముందు చింతామణి యింట దాను నిలువబెట్టుచున్నాఁడు గావున, (కాకినాడ వేశ్యలకు వేదాంతపు పైత్యము సుప్రసిద్ధము) తాను నా చింతామణివలె లింగభేదము విసర్జించి యేకశ్లోకమును గల్పించెను [భవానీశంకరునితో చింతామణి నెరుగనట్లు నటించెనుగాని, అప్పుడప్పుడు గుడిమేళమున జూచుచునే యుండెంగదా. ఇందచ్చెరువంద బనిలేదు]

'వృక్షాగ్రవాసీ నచపక్షిరాజః చర్మాంగధారీ నచసోమయాజీ
త్రినేత్రధారీ నచశూలపాణిః జలంధరిత్రీ నఘటో నమేఘః॥'

'దీనిభావమేమి తిరుమలేశ' అని అడుగు తెచ్చుకోవలయును. [ఇందన్నియు నీకారాంతములేయైన, నీదీర్ఘములను బిల్వమంగళుని నిగ్గుతో గలిపి ముడివైవ వీలు గానుండె

డిది] ఇందు (1) నాలుగవ పాదమునందలి ప్రథమార్ధభాగము పైవానివలె సమాసపదము గాకపోవుటచేత, ప్రక్రమ భంగదోషము ప్రాప్తమైనది (2) జలంధరస్త్రీ స్త్రీలింగాంతముగా నుండెను. మిగిలినవన్నియు పుంలింగములు. [ఇందువలన చింతామణి అనేక విటులలో జరించువదియని చెప్పుట గాబోలు] కావున బిల్వమంగళుడు రంగస్థలముపై మహాపండితునివలె నటింప నవసరములేదు (తక్కిన మూడు సుగుణములును చింతామణి వలననే నిరస్తములాయెనుగదా) 'రామునితోక - పివరుండని' జనుపనీ, ధృతరాష్ట్రుజులేగలు - గంగస్వస్థులే అనుచు ఉదాత్త అనుదాత్త స్వరితములు చెడ, రాగము విసరి విసరి పాడి వేలకుంగొట్టనీ, ప్రవేశించినది వీధిత్రోవయైనను, అదియే దొడ్డిత్రోవగా దలచి నిష్క్రమింపనీ, 'స్వగతము'ను పాత్రముతోడను, 'ప్రకాశముగా' నన్నది సభికులతోడను చెప్పనీ, దోషమేమియులేదు. అయినను ఏను ప్రదర్శనములు చూచుట చేత వారి నాట్యపరిజ్ఞాన మించుక నిట్టిచో చర్చించుట మంచిదని తోచుచున్నది. నూతననాట్య శాస్త్రరచన కివియన్నియు ముఖ్యములుగదా.

(1) నటుడు రంగస్థలమునందు నిక్కి నిలువబడుచున్నాడు (2) కోతివలె అవయవములను మితిమీరి చలింపజేయుచున్నాడు (3) శోభకుల వంకజూచి వారు ముఖము ముడిచిన పరితపించుచు, నవ్విన సంతోషించుచున్నాడు (4) గొంతెత్తి పద్యభావమొకవంకగను, రాగభావము మఱియొకవంకగను దోపింప, కంగు కంగున పాడుచున్నాడు (5) పాటకుల కాచారమైన 'మందునూరుట గొలుసు లల్లుట' మొదలగు నభినయపద్ధతుల ననుసరించి చేతులాడించుచున్నాడు. (6) భక్తవర్యుని వైకుంఠపట్టణమును రాగమను త్రాటితో, గాలిపటమును క్రిందకి లాగినట్లు లాగి నేలకు గొట్టుచున్నాడు (7) టికెట్టు లేకుండ ప్రయాణముచేసి స్టేషను ప్లాటుఫారముపైన షికారుచేయు ప్రయాణికుని విధమున, రంగస్థలముపై స్వాతంత్ర్యము నెఱపుచున్నాడు (8) సిగరెట్టుపై బుద్ధిపారి తనకుపనిలేని సమయమున లోనికిబోయి రెండుపీల్పులు పీల్చి పొగ నేపథ్యములోనికి విడుచుచు మరల ప్రవేశించుచున్నాడు. ఇంక జాలును. విసుకుబుట్టుచున్నది. కంపెనీ డ్రామాలలోని అభినయము తెలియుట కివిచాలును.

చింతామణియొక్క కపటసౌందర్యమను గేలమునకు తగిలింపబడిన కపటపాండిత్యమను నెర మ్రింగి, శృంగారరస నిలయమైన చింతామణి యింటిలోనికి, నాయకుడు ప్రవేశించెను. 'శాంత' రస మంతరించినదిగాని 'దానియింటి జలంబె త్రావుచుండి'నను అప్పుడప్పుడింట భోజన మొనరించుచుండెను. కాని యింటికి బోయినప్పుడెల్ల శాంతరసము 'దుర్దాంతమైన వీరరసము'గాగా భార్యపైనను తండ్రిపైనను గినియుచుండువాడు. శాంతరసమునకు మరల నొకత్రోపు తగిలినది. అదిగాక, వ్యాపారగోష్టి విడిచెను. తత్సంబంధికులను చిత్రచేత మెడబట్టి గెంటించెను. చింతామణికి పెద్ద మేడ - మూడో, ఏడో కాక యీ ప్రకరణమువలెపదో - అంతస్తులుగలది - గట్టించెను. కూర్చుండి తినుచుండెను. విటనాయకుడై విహరించుచుండెను. ఇట్టిచో గుళ్లు గోపురములు నాగవనుట నిక్కమకదా.

4వ ప్రకరణము.

ఆ. వె॥ తండ్రిపడఁగ శోకతత్పరుండయ్యెను । పిడుగుపడఁగ గరుణవివశుఁడయ్యె
రసముస్థాలుగూడి ఉంటులరాటాన ! నుత్సవముల మివుల నుల్లసిల్లు॥

ఇట్లీతఁ డింకను చివరంట భ్రష్టుఁడు గాకపూర్వమే తండ్రి మరణించెను - వెంటనే, పార్సీనాటకములయందు అరణ్యము పురముగను, పురము శ్మశానముగను, 'టపేలు'న మారునట్లు వీని వీరరసము విపులశోకమైనది. మరల 'ఢాం!' పిడుగు పడినది. శోకము, భయానకమై దుఃఖవంతుఁడైన నాయకుని చింతామణియెడ ననుకూలుని గావించినది. తండ్రి కొడుకులతో, వావివరుసలులేక చరించు చింతామణితోడి నేస్తమీ మహాపండితుని, వావివరుసలులేక, రసములయందు, నీరసవృత్తిగలిగి, సంచరింపంజేసెను గాబోలు పాపము! అంతఁ నీతఁడేటియొద్దకు పోయెను. దాటుటకు పడవయెచ్చట నున్నదో! - పతివ్రత! - రాధ! - పాపముకట్టుకొన్నదిగా! - అచ్చట నచ్చట ప్రాకులాడెను. శవము చేతికితగిలెను. దాని నేటఁబడవైచెను - వ్యామోహమున నున్నవాఁడాగా అసహ్యపడలేదు. దానిసహాయమున నీదఁదలఁచెను. వాని యదృష్టము. ఆశవమేటఁబడగనే మునుగక తెప్పవలె తేలియాడి వాని నేరుదాటించెను. ఔరా! పతివ్రతా శవము యొక్క మహిమ! తెప్పవలె తేలియాడినదిగాని కప్పవలె కదువలేదు నయమే. అంత నీతడు ఆవలియొడ్డుజేరి ఆచింతామణియెడలి వ్యామోహమేమైనదో, ఆశవమును 'జలచరముల పాలు చేయజాలక - నక్కలపాలు చేయుటకు గాఁబోలు - ఏటియొడ్డున భద్రపఱచి రా నవకాశము గాంచెను. మఱియొక పొగపాటు - ఈత డనాథప్రేత సంస్కార మొనరించి (దిక్కులేని శవమును దహించుట) కోటియజ్ఞముల ఫలమును సంపాదించి, చింతామణికి ధారవోయ దలంచెనేమో! అదికాక, ఆయేటఁ బడగనే చన్నీటివలన, నామోహంపుకాక చల్లారెను కాబోలు! అంత గోడదాటి లోనికిబోన - నొక్కసారియైన దలుపు తట్టకుండగనే - ప్రయత్నించెను. అచ్చట మగలప్రాకులాడెను. ఉడుముజాతి పామొకటి చేతికితగిలెను. అది గోడపట్టు విడువక, తెగిక్రిందపడక, ఆపట్టు విడచి వీనినిపట్టి కఱువక గోడ దాటించినది. శెభాష్! కల్పనాచతురతయన్న నిట్లుండవలయును. ఏజాతిపాముగా దీనిని భావింపవలయునో తెలియకున్నది. పైగా దీనిపొట్ట చీల్చి అరగంటసేపటివరకు రక్తము కారుచుండెనట. జలగవంటిది పాము! ఆయేటి ప్రవాహములో గలియుటకు గాబోలు. [ప్రకృతిలోని సామాన్యవస్తుధర్మ మెఱుంగజాలకుండుట శోచనీయము. వేటకాడు వెన్నంటఁగా పెద్దపులి పరుగెత్తిపోవుట మొదలగు విపరీతములు కలికాలపు ధర్మవైపరీత్యముల నెఱుకపఱచును. కల్పనమునగా నిట్టి యసంగత వృత్తాంతములని లక్షణనిర్ణేతలు భావించి యుండరు]

'తండ్రి నాతడు విడువలేదు తండ్రియే వానిని విడిచిపోయెను.' ఔరా! దుఃఖమున హాస్యము! - తరువాత పత్నియు మరణించెను! గుభాలున నాశవముపైబడి యేడ్చెను! ఇదిగో - ఇందునకు ఆశవము నీతఁని భద్రపరచినది. -* [ఈ చింతామణీ ప్రకరణము

తపద్వయపరమైన శాంతరసముతో సాంతమైనది] అట్లేడ్చుచుండగనే, చింతామణి విశ్వరూపసందర్శనము గావించెను. జ్ఞానభానుఁడు బిల్వమంగళుని విగ్రాడబెతికి మేధస్సునందు తనకిరణములను జొప్పించి వానిని కట్టకడకు పరమశాంతచిత్తు నొనరించెను. ఇంతలో సోమగిరియోగి - అవునో కాదో - అను పేరుతో నొకఁడు ప్ర[వే]శించెను. [శాంతరసస్వరూపమైన చింతామణి శమస్వరూపమైన బైరాగితో ప్రత్యక్షమైనప్పుడు - ఎంతటిభ్రష్టుఁడేనియును నిట్టెరహింపఁడె యేరుమేరుగాన్]

శాంతరసము మిగిలిన రసములన్నింటిచేతను తన్నులు తాపులు బడి చివరకు ఈ విధముగా ఇల్లెక్కి- కోడియై కూయసాగెను.

వాసుదేవమూర్తి. నాయకుని తండ్రి. ఈతఁడు రెండు మూడు పొరపాటు లొనరించెను. అవియే గ్రహపాటులై వీనిఁ జంపివైచెను. (1) బిల్వమంగళునిచేత పురాణగోష్ఠి సాయంత్రమునకు మార్పించెను. (2) చింతామణికి తనయుద్యానములోనసే యేదో బహుమతి యొసంగి పంపివేయఁదలఁచిన కొమరున కడ్డమువచ్చి వానిని దానియింటికిఁ బంపివేసెను. చేతగానివాఁడు నేపథ్యమునడపి నాయకునియందు రసభంగము పొసఁగించిన దోషమార్జించినాఁడు. తత్ఫలముగ (3) రాక రాక రంగస్థలమునకు వచ్చి అందే బెంగపడి చచ్చిన పాపమునకుఁగూడ పాలుపడినాఁడు. (ఈకతమునవే వీని పాత్రమునకు మెడలు లేకపోయెను) అన్నిఁటి ఫలంబును ఆరంగమునఁదే యనుభవించెను. ఎట్లు? చావునకు సిద్ధపడియు చాలపాట్లు చెప్పవలసివచ్చెను. మూల్గవలయును. ఒప్పవలయును. దగ్గవలయును. మరణవేదన నభినయింపవలయును. వివిధవయస్స్వభావములను సక్రమముగ నన్నిపంక్తుల విమర్శింపవలెను. పాట్టవిడచిన మొత్తమువీద రాఁగల 'కప్పు' హాష్కాకి.

బిగ్గరగా వడిగాజెప్పిన రసభంగము. మెల్లగా హీనస్వరముతో జెప్పిన రక్తిభంగము. ఏమిసేయును? ఈవిషమ సంధిలో బడిచచ్చెను. ఇంకను పద్యములు లేవు నయమే. ఉన్నయెడల లేచివదివి మరల పరుండవలసి వచ్చెడిది!

5వ ప్రకరణము.

ఆ. వె॥ ద్వాపరమున గొల్లవనితలఁ గామించి । రాధ ముద్దుగొన్న రమణమూర్తి
కలియుగంబునందు గడిమి చింతామణి । పడకటింటఁజేరి మిడిసియాడు॥

కృష్ణుఁడు - పాత్రచిన్నది. పాట్ట గొప్పది. మతబోధకుని గంభీర దీర్ఘోపన్యాసమంతగలదు. ఏమిరసము కృష్ణుడు ప్రదర్శింపవలయునో తెలియలేదుగాని సభికులు మాత్రము నీరసమును ప్రదర్శించిరి. పెద్దవాఁడీ వేషమును ధరించిన ముద్దబ్బాయియనిపించుకొనును. చిన్నవాఁడు ధరించిన - అమ్మో! మూడుషేశీల వచనము! - రా

ఖం కొడలె సభకు - అనుచు ప్రారంభించి [అల్లా, గాడ్డు, రామ, కృష్ణ, - నిఘంటువు పూర్తిగావించి] ప్రస్తుత మానవతత్వ మంతయు విమర్శించి విడువవలయును. ఇప్పటి పాఠశాలలయందింత పెద్దపాఠము వల్లెవేయ నవసరము లేకపోవుటచేత, బడిపిల్లలచేత చదివించినను కష్టములు తప్పలేదు. బడిపిల్లలకు చేతులు త్రిప్పుట చేతగాదు. పాట్టు మఱచినప్పుడెల్ల పంతులుగారి బెత్తమునకు చెయిజాప సిద్ధపడుట నభినయింతురు. ఇతరులో, నేర్చినదెల్ల మఱచి రాతిలోని కప్పను పైనను, చెట్టుపైని చిలుకను క్రిందను జూపి స్మృతికి దెచ్చికొని సర్దుకొనుచుందురు. ఇంతపాట్లు వ్రాయువిషయమున భరత ముని యిట్లు చెప్పుచున్నాఁడు.

'బహుచూర్ణ పాదవృత్తం జనయతి ఖేదం ప్రయోగస్య' [విస్తారగద్య పద్యరచనము రసప్రదర్శనమునందు ఖేదము పుట్టించును] అయినను నేటినటుల వృత్తియందు రసప్రదర్శన సౌభాగ్యము, శూన్యము గావున నీపలుకున కిప్పుడు పాటిలేదందురు గాబోలును. అంతియగాక యీ కృష్ణుఁడు చిత్రప్రవర్తనము గలవాఁడుగా దోచుచున్నాఁడు. సమస్తజ్ఞాన సంపన్నురాలును మహాపతివ్రతయునైన రాధకు ఏటిగట్టున, దిక్కుమాలినచావు ప్రసాదించెను. చాల చెడుదారింబడి చరించెడు చింతామణికి స్వప్నసాక్షాత్కారము. ప్రబోధము. ఏమివైభవము! ఇందునకు కపటవినయము కారణము. ఈచింతామణి ఎన్ని కల్లలాడెను. ఎందఱను నమ్మించి గొంతులు గోసెను. 'నాపై వానయిడి కల్లలాడు కలుషమతులను, దేవునియెదుట అన్ననోటనే తెగబొంకు చెంపలులను జూచి సహింపజాలనన్న పలుకబద్ధమాయెనే. ఓహో! ఈ చింతామణి దేవునిమఱచి యబద్ధమాడి, పిదప చెంపలు వాయించుకొనెను గాబోలు! అదిగాక, యీతఁడు నలుని వలె కలిపురుషుని మాయకులోనై. చింతామణిని గామించెనేమో. అటులయిన యీ వేషము పెద్దవాఁడు వేయుటయే మేలు!

దామోదరుఁడు. చింతామణిచేతి తాంబూలమును నిరసించిన సౌభాగ్య దామోదరుఁడు. బిల్వమంగళుని పురాణగోష్ఠి స్నేహితుఁడు. పేదబ్రాహ్మణుఁడు. పద్యముల కర్థము సైతము తెలియనివాఁడు. పురాణము విని విని బిల్వమంగళునకు నీతిబోధకుఁడైనాఁడు. రెండుపళ్లున్న లోకక్రమైనసైనవటుల, రెండు దుశ్శకునము లోకసుఖమున మైనట్లుచెప్పి తనకుగల అభినవగణితశాస్త్రజ్ఞానమును వెలిబుచ్చినాఁడు. [వీడు రిషాగ్మరు గావున చింతామణి యింటికి పోమానెనో, శ్రీహరికి జడిసి పోమానెనో తెలియదు] 'అరయన్ శంతను పుత్రుపై' అను పద్యమును కూనరాగముతో బాడుచు నీతఁడు ప్రవేశించెను. కేవలము కూనరాగమనుటచే నటులకు దాని స్వభావము తెలియదాయెను. [పిల్లికూన రాగమన్న బాగుండెడిది] మఱియు నటులు తిక్కయజ్వ ఆపద్యము తమకొఱకే రచించెననుకొని 8 మంది భక్తులను 8 దిక్కులయందు జూపి నమస్కారబాణముతో పాటకచేరీ సేయుచు అభినయమును పూర్తిగావించిరి. ఈతఁడు కొన్ని చోట్ల హాస్యరస ప్రధానుఁడుగాఁ గనఁబడుచున్నాఁడు. హాస్యరసమునకు శృంగారరసముతో మైత్రి. శృంగారమున్నచోట నీతఁడులేఁడు. కావున నితఁడు హాస్యప్రధా

నుఁడు గాఁడేమో. ఎవ్వఁడైననేమి వాఁడు దేవమూర్తికిని రాధకును - చిత్రముగా - పెద్ద కొడుకై 'రిఫారం' ఉత్తరక్రియలు సెలవి, యింతపుణ్య మార్జించినాఁడు. [ఇందువలన నీపాత్రమునకును చివరకు పతక మొకటి నిర్ణీతమయ్యెను.] కాని ఈ చింతామణివలన నన్ని రసములును శాంతపడగా, నిట్టిపాత్రలయందు రసవైశ్చల్యము కుదుర లేదుగాబోలు! 'శాంతిలె సమస్తమానవ స్వాంతములును' అని గ్రంధమునందే యున్నదిగదా!

భవానీశంకరుడు (అనగా గంగాధరుడు) విటవర్తనమునం దారితేరి, చింతామణీ బిల్వమంగళుల సంధానకరణమ్మున జేటుఁడై, చివరకు 'శ్మశావడి' మాపునధరించి, పేరు సార్థకమునకు దెచ్చికొనిన. బిల్వమంగళుని చిన్ననాటి స్నేహితుఁడు. చివరదశ యందు రంగస్థల మలంకరించెను (1) ఉన్నదెల్ల యూడ్చిపెట్టుకొనెను (2) అప్పులి చ్చువారెవరూ లేకుండ చేసికొనెను. [కాని సిల్కువస్త్రములు, నెక్టైయిలు వగయిరాలు నీళ్లకావడి మోయువరకును ధరించుచునే యుండెను. అవి చింతామణి దయాలేశము వలన లభించుచుండెనేమో తెలియదు. ఈ సందేహము నటులే దీప్యవలయును] (3) శ్రీ హరినిజూచిన సింహస్వప్నము. అందువలన నానాఁడు దొడ్డిత్రోవ నింటఁ బ్రవేశింపఁ దలంచెను. కాని, ఆ త్రుప్పతలముండకు బదులు గబ్బిమొగము సుబ్బిసెట్టి యెదురయ్యెను. (4) అందువలన చింతామణి మఱియొకనికై ప్రాకులాడుచుండెనేమో యను సందేహము [ఇది అన్నిటికంటె పెద్దసంకటము] అంత వానితో గొన్నియడుగులు వెనుకకు బోవుట - బిల్వమంగళుని గలిసికొనుట! శబాస్! చేతజిక్కినది మిదుత! అన్ని సందేహములు తీరినవి. అన్నిభయములు నుడిగినవి. బూతరించుచు చింతామణి యెదుట నిలువవచ్చునని తలంచెను గాబోలు! తెరయెత్తకముందే చింతామణిచెంత తిన్నపై కూర్చుండెను. తెరయెత్తిన వెంటనే జోరుగా ముస్తాబును గుఱించి ప్రశ్న. అంతకు ముందేమి సేయుచుండెనో! అక్కటా యిందువలన బ్రవేశవైచిత్ర్యము నాశనమై యిందలి రసనిస్సారతను జాటుచున్నది. [ఇది యిటుండ మాసందేహ మొకటి యుండనే యుండినది. బిల్వమంగళు డేటియావల గాపురముండెనే, సానివాడ సమీపమున కేల వచ్చెను? ఒకవేళ బాకీలు వసూలుచేసికొనుటకు వచ్చెనుగాబోలు!] బిల్వమంగళు నప్పడుగుటకు కాలవ్యవధి యవసరము. అందాఁక చింతామణి నోరుగట్టవగును గాని దాని తల్లిముండ అసాధ్యురాలు! అందువలన నిరువురను సమాధాన పఱచుటకును వీలులేమి. వాని చిత్తవృత్తి యెట్లుండునో నటులు తెలిసికొనినట్లు తోచలేదు.

తరువాత, నీతడు బిల్వమంగళునియొద్ద నెట్టుప్రవర్తింపవలయును? అప్పుమాట తీరిపోయినది. చింతామణి చెంతకు వానిం జేర్పవలయును. విటస్వరూపముతో నతనిం జేరుటకు శంకింపడా? గుమ్మడికాయల దొంగ భుజములు తడిమి చూచుకొనును. వేషము మార్చక నటులు తుదివఱకు నొకవిధముగనే యుండుటకు రెండు కారణములుండినవి. (1) బిల్వమంగళుఁడును, విగ్గులు, సిల్కువస్త్రములు తగిలించుకొని ముందే విటుఁడైనట్లుండుట (2) నటులీవిగ్గులను దీసివేయఁజాలకుండుట (ఈ విగ్గులు ముఖములను గప్పి రసప్రదర్శనమునకు గొండంత యడ్డమగుచున్నవి. ఓ ఏడకొండలవాఁడా! నీవుకర్తిరిం

చుకొనిన కెండ్రికలు, యిట్టివిగ్గులు తయారుసేయువారికి విక్రయింపక, నాట్యకళాభివృద్ధి జేయఁదలంప రైతివిగదా!) ఈకారణములచేత భవానీశంకరుని రూపభావాదుల పరివర్తనములు గన్పట్టనేలేదు. మఱియు వదేమిచిత్రమోగాని యీవేషు సంఘముల యందును ఈవేషధారియే మిక్కిలిగ పాడఁగలవాడయ్యెను. అందువలన రసమునూట తలపెట్ట నవసరమే లేకపోయినది. (సంగీత పాటకుల సహాయమిచ్చుట నొకింత యవసరము. నాటకగ్రంథకర్తలు తమ యనుమతిలేక, నాటకములెవ్వరు ప్రదర్శింపరాదనుచున్నారు. అట్లే వీరును తమ యనుమతిలేక యెవ్వరు నేరంగస్థలములందును సంగీతము పాడఁగూడదనిన, భావరాగతాళముల సామరస్యముచెడిన సంగీతము నశించును. నాటకప్రదర్శనములును, హరికథా కాలక్షేపములును మంచిగతులఁగాంచి వృద్ధిజెందును)

రెండవ యంకమున సుబ్బిసెట్టి బేరము కుదుర్చుకొనుటకు వచ్చెను. ఆసాయంకాలమునందే మూడవయంకమున భవానీశంకరుని బూకరింపుకథ. ఆయంకము చివరనే గదా - శ్రీహరి బాగుగా పుర్రెకెక్కించి ఆరాత్రియే రమ్మనగా - సుబ్బిసెట్టి పడకకు వచ్చెను. ఇట్లొకనాటి కథయే ఒకచోట జరిగినదానినే రెండంకములుగా వ్రాయుట! 8,9 అంకములు నిట్టివియే. ఏలాగుననో పదియంకములును పూర్తియయ్యెను. చాలదా?

6వ ప్రకరణము.

ఆ. వె॥ చిత్రసంటుకొనెనో చింతామణీలోలు । డో యెఱుంగనెట్లహో! యితండు,
యెవ్వఁడైననేమి? యేనిషుంటువునందు । వేశ్యక్రింది పదము వైశ్యపదము॥

సుబ్బిసెట్టి - ఒకకోమటిబిడ్డ. విటశేఖరుఁడు. ఈనాటకము వీనికొఱకే వ్రాయఁబడినది. దృష్టిదోష పరిహారకుఁడు. ఇతనివలననే, యీ ప్రకరణమునకీవాసియు, విఫుల విక్రయమును. ఈ పాత్రమును ధరించినవాడు కడుపున నొక చాకిమూట మూపున తాళపుంజెవుల గుత్తియు దానిగొలుసును జేబులో రూపాయల దొంతర వ్రేళులకు పట్టీపట్టని యుంగరములు, తలకు గాలి తగులకుండ పిత్తుటగ్గును (తలపాగ) ధరింపవలయును, అగపిశెసు నూనె, అగపాను సబ్బు, ఆగుబిండెల నీళ్లు లేక వవలని మసి యొడల్లెల్ల బూసికొనవలయును. నాభిని భేదించి, గుండె లవియజేసి, కంఠనాళముల ద్రెంచి వేయులాగున బొంగురుగొంతుకతో గాడిదవలె పలుకవలయును. దగ్గిన వెగ్గు. సకిలించిన చావు. పరీక్షాకార్యస్థానమువారు వీని కష్టమునకు దగిన విలువగల పతకమును విర్ణయింపరైరి. ఇంతయేల? ఈపుస్తకమున కింత వ్యాప్తిగల్గించిన వీనికి గ్రామ్యభావ యిచ్చి గ్రంథకర్తయే వీనిని నిమని గావించెను. చిత్రసంటించుటకు కాదుకద వీని నిట్లొనరించినది? వీడు చెత్తముండ చేపలకంపు కానిముండ కల్లుకంపు మొదలయిన వెన్నిరూ రుచిచూచి రంగనాయకికి నడమంత్రపు సిరిబట్టించి చింతామణితో దివాలాదీసిన కొఱవిగాడు. తండ్రి చేరబీసినదాని పొందాసించిన యొగ్గుసిగ్గులు లేనివాఁడు. ఇందరి భోగిను

తో ప్రవర్తించియు చింతామణియింట చిత్రతోడనే సంతృప్తి జెందిన వెఱ్ఱి వెంకటాయ! ఈ విషయమున ననేకశంకలు. (1) చిత్ర రంగనాయకికంటె చక్కనిది. వీడిట్లుంటకు కారణమేమి? నిజమంతియేనా? చింతామణి ముఖప్రీతి కట్లనియెనా? ఎలుగుబంటివంటి వీని కందచందముల వ్యత్యాసము తెలియదా? ఇవియన్నియుగాక, 'చిత్రనంటించి' అనువృత్తాంతము సమర్థించుటకిట్లు వ్రాయఁబడెనా (2) చిత్రకీతడు గాజులకై రూక యిచ్చుట, దానితో సెకసక్కెము లాడుట. ఇది సంబంధమును సూచించునా? లేదా? (3) పెసరట్టు పెట్టుటకై యాతఁడు దానినేఁ దలఁచుట. ఈవాక్యసంగమేమి స్ఫురింపఁజేయును? చింతామణి వీనితోనుండియే. భవానీశంకర బిల్వమంగళులకు, సందేహము పుట్టకుండ నిట్లుబద్ధమాడెనని చాలమంది తలంచుచున్నారు. కాని గడుసునుండకొడుకు కోమటిబిడ్డ గుట్టెంతకును బయలుపెట్టినాఁడుకాఁడు. ఈతఁడు హాస్యరస ప్రధానుఁడని మాయూహ. కాని షడ్రసములు ప్రదర్శింపవలయు. [పెసరట్టులు రుచిమూచి వారీషడ్రసముల ననుభవింపనగును] చింతామణి చిత్రల వలమున శృంగారము. శ్రీహరి డుబ్బులడిగినప్పుడు భయానకము. అదిసరదాభంగపరచినప్పుడు భీభత్సము. అట్లమ్మచో కరుణ. నీతిబోధించినప్పుడు శాంతము - అహా! వీనియందును శాంతరసము సిద్ధించినది! ఇక నేమి? ఇది శాంతరస ప్రాధాన్యమే! కాని శృంగారముతో మాత్రమే మైత్రిగల హాస్యము నిఖిలరసములయందును ప్రవర్తించుటయే వీని పాత్రమునందలి వైపరీత్యము.

సోమగిరియోగి - పెంటపాటి బైరాగి! ఆధునిక కాలానుగతమైన యీరూపకాంశమును, అనుపమానమైన కృష్ణకర్ణామృతమును రచించిన లీలాశుకునితో గలిపిన కపట మునిముచ్చు [ఏకాలపు వృత్తాంతము లప్పటిదేశకాల పాత్రానుసారముగా ప్రవర్తింపజేయుటయే ధర్మమని యిక్కాలపు కవులుగాని నటులుగాని తలంపకుండుట శోచనీయము. ఆంగ్లులయందీ యభాగ్యవృత్తి గానఁబడదు. పార్శీనాటకులు నీధర్మముం గాపాడుచునే యున్నారు. కాని యాంధ్రుల కీసౌభాగ్యమింతలో లభింపమికి ప్రబల కారణ మొండుగలదు. అమితధనవ్యయము మాత్రము సేయఁగల ధనికు లనేకులు ఈనాట్యకళను స్వాధీనముచేసికొని వారిదగ్గఱను దగినట్లు దుస్తులు, మొదలగు వాటిని తయారు చేయించుట. అందువలన సాధారణ సంఘములవారి ప్రదర్శనములు ప్రజలదృష్టికుత్సాహజనకములు గాకపోవుట. ఈకారణమున నెల్లరును నిరుత్సాహులై పాత్రోచిత కాలోచిత వేషధారణ మొనరింప మానుకొనుటయు సంభవించుచున్నది.]

ఈమాయబైరాగి, ఈశ్వరవిలాసము సులభముగా తెలియరాదనియు నిజమహత్త్వముచే ధూర్తచరితులైన చింతామణీ బిల్వమంగళులకు చౌకజేసి గంజాయి కొఱకో, సారాయము కొఱకో, విక్రయించెను గాబోలు! కృష్ణసాక్షాత్కారమునకంటె వీని సాక్షాత్కారమే చోద్యమైనది. ఆగొల్లకృష్ణుడు నియమింపగా, నారేయి రాధ శవము చెంత జాగరణంబు సేయుచు, నా యపూర్వపుణ్యదంపతులా యేటియొద్దునకు రాగనే, చిక్కెనురా సమయమని, వారి యెదుటనిల్చి వారిని పరస్పరబాహులతాపాశములనుం

డి తనయోగదండముతో మాంత్రికుని చందంబున విడదీసి తొమ్మిదవ యంకమునకు భక్తి గావించి చక్కఁబోయెను. కాని వీనిపాత్రమునకు మెడలు నిర్ణయింపబడక పోవుట చేత మాకోపము తీరిపోయినది.

ఈవేషమును ధరించినవారును మహాత్ములేయైరి. ఎట్లన - ఈపాత్రము మిక్కిలి చిన్నదియను నశ్రద్ధచేత క్రొత్తవారిని నియమించిరి గాబోలు. వారు బిడియముచేత సభికులకు తమ శ్రీముఖమండలములు జూపకయే నిష్క్రమించిరి - ఒకవేళ నాసభికులలో నీశ్వరలీలామృతముం గ్రోలదగినవారా బిల్వమంగళునిం బోలినవారు లేరని యెంచిరేమో.

పురుషపాత్రములు సంపూర్ణము.

7వ ప్రకరణము.

—§ స్త్రీ పాత్రములు §—

క॥ చీరయు, జాకెట్, పిగ్గును । హారములున్నగలు దాల్చి యాడుదియగునా?
తీరైనపలుకు నడయు । య్యారము నను వైన చేష్ట లన్నియు వలదా?

రాధ - బిల్వమంగళుని ధర్మపత్ని. భూలోక రంభ. సమస్తజ్ఞాన సంపన్నురాలు! యోగ్యురాలు! మహాపతివ్రత! కాని కథానాయిక కాదు. అదృష్టవశమున మామగారి మూలమున చెడనున్న చదువు పూర్తియైనది. [ఇదిగో కాలసాంకర్యము] ఆకారణముననే గాబోలు నీమె మిస్సీదొరసానివలె భాగవత మొకటి చేతబట్టి, దామోదరుండను నొక పరపురుషుని యెదుట పురాణము చదువుటకు తయ్యారైనది. సంఘసంస్కారదేవత యీమెయే గాఁబోలు! ఈసందర్భమునఁ గొంతచర్చ జరుగవలసియున్నది. మనదేశమునందు స్త్రీలకేనాఁడును విద్యయే లేదా? ఎంతకాలము క్రిందటినుండి యీ హీనదశ సంప్రాప్తమైనది? ఈవిచక్షణ యెవరికిఁ గావలయును. 'దున్న యీనినదనిరి 'దూడను గట్టివేయుఁడ'నుటయే తరువాయి. పూర్వకాలమును ప్రదర్శించి తద్ధర్మములను నిరూపించుట నేటియవినీతిని నిందించుటకే కాదాయేమి? ఈవిధమైన కాలధర్మ సాంకర్యము పూర్వధర్మ గౌరవమును పాడుచేయుట యగునే! ఈ యపకార్య మాంధ్రులనొసఁటనే వ్రాయబడి యుండుట విచారకరము.

ఈరాధ మృత్యుముఖమునున్న మామగారియొద్ద పురాణము జదివి యూరకుండిన పూర్వకాలధర్మమును స్త్రీవ్యక్తి ధర్మమును సగౌరవముగ నుండెడివిగదా. పరపురుషునియెదుట పాటకచేరీలు చేసినగాని, స్త్రీస్వాతంత్ర్యము రక్షింపఁబడినట్లు కాదా? స్త్రీయనఁగ 'ప్రకృతి'. ప్రకృతి తన్నుఁజేపట్టిన పురుషునకుఁగాక తనస్వభావము మఱియొక్కనికి వెల్లడించుచుండెనా? ఇఁకఁ బురుషుఁడో విశ్వవ్యాపన శీలుఁడైనను, తనా

యించిన ప్రకృతియొక్క ధర్మమునకే రక్షణహస్తమొసంగి దానిం గాపాడుచున్నారు. ఇట్టిదిగదా ప్రకృతి పురుషుల యన్యోన్యము! మగవారీ తత్వమెఱుంగక స్త్రీల యెడ తమ దౌర్జన్యము నెఱపుచు విశ్వలీలాసిద్ధికి భంగము గల్గించుచున్నారు. అందువలన నాడువారును పురుషులవలె దౌర్జన్యము వహించి యట్టి విశ్వలీలాసిద్ధికి నాశనమాపాదింపవలయుంగాబోలు! ధర్మనిర్ణేతలు సతీపతుల కేకవిధ ధర్మకార్యాచరణమే నిరూపించిరి. కాని స్త్రీ పురుషులను సృజించుటలో నీశ్వరుం డొనరించిన భేదమును వారును సరింపక తీసినదిగాదు. ఆ భేదము తొలగింపఁబడిననాఁడు వారిరువురు సమవృత్తియందు నిలువఁదగియుందురు.

రసస్వభావమును నిరూపించుచు, నాయికా నాయక భేదములు చెప్పుచో రసమంజరీకారుఁ డుత్తమ స్త్రీ పురుష లక్షణము లిట్లు నిర్ణయించెను.

“స్వామిన్యేవానురక్తా స్వీయా” భర్తయందు మాత్రమే యనురాగము గలది స్వీయ – “అస్యాశ్చేష్టా – భర్తృశుశ్రూషా – శీలసంరక్షణ – మార్జవం – క్షమా” ఆమె వ్యాపారములు పతిసేవ – సదాచారమును కాపాడుట – మనోవాక్కాయములయందు ఏకరూపముగా నుండుట, ఓర్పు – ఇదిలక్షణము. ఇఁకలక్ష్యము.

శ్లో॥ గతాగత కుతూహలం నయనో రపాంగావధి
స్మితం కులనతభ్రువా మధర ఏవ విశ్రామ్యతి
వచః ప్రియతమశ్రుతే రతిథిరేవ కోపక్రమః
కదాచిదపి చేత్తదా మనసి కేవలం మజ్జతి॥

పతివ్రతలు మితిమీరి చూడరు. పకపక నవ్వరు. బిగ్గరగా మాటాడరు. ఎప్పుడైన కోపము వచ్చినను దాని నితరులకు తెలియనీయరు. ఇక మగలనుగుఱించి

‘విధివత్ పాణిగ్రాహకః పతిః’ యథాశాస్త్రముగా పెండ్లియైనవాడు పతి.

‘సార్వకాలిక పరాఙ్గనా పరాఙ్ముఖత్వే సతి సర్వదా స్వీయాయా మనురక్తో(అను) కూలః’ ఎప్పుడును పరస్త్రీవిముఖుఁడై సదా సతి (స్వీయ) యెడల ననురాగము గలవాఁడనుకూలుఁడు. ఇట్లిరువురకును సమానధర్మమే నిర్ణయింపబడియున్నది.

ఈ విషయములు దెలియక, స్వాతంత్ర్యమను పేర స్త్రీత్వము నిందపాలసేయుట జగమును నాశముసేయుటయే. పురుషులను ధర్మప్రవర్తనము దెసకు పురికొల్పుట స్త్రీ స్వాతంత్ర్యమును గాపాడుటయే యగును. చింతామణియేమన్నది? ‘మాకిప్పుడు సంతానయోగములేదు’ ఏకతమునకు? సంపూర్ణమైన స్వాతంత్ర్యము కతమున. అట్టిస్వాతంత్ర్యమును మేము కోరుచున్నామా? అనవచ్చును. లేదులేదు. ఆమాట మేమనజాలము కాని యిప్పటి పురుషస్వతంత్రత కనురూపమైనదానికి సతియొక్క స్వరూపము లేదని తలంపనగునుగదా!

ఈ రాధ దామోదరునియెదుట పురాణము పాడినది. వానితో నవ్వుచు మాటలాడినది. సప్తమాంకమున నాగుఁడు గాకపూర్వము వచ్చి వంచినీళ్లయినను త్రాగక

తాగనే ఖండితయై స్వాతిశయమును జూపినది. అష్టమాంకమున మామగారి యను గతికై శ్రమపడుచు మగఁడు వచ్చినతరువాత నాతఁడు తిరిగి వెళ్లునేమోయని యేటి కేగి పడవ దూరముగఁ గట్టివేయించి నాధునకు కష్టముగలిగించినది. అంత తనకు మామ గారిచ్చిన ఆస్తివిమయిక మైన సర్వస్వాతంత్ర్యములును నాధునకిచ్చి పతిభక్తి నెఱపి ఆ తండు మృతజనకు నింటవిడచి పోఁగనే, రాద్ధాంతము ప్రారంభించెను. చింతామణిని నాలుగుతిట్టి ఈశ్వరుని కింతగడ్డిపెట్టి, దేశబాంధవులను ప్రజానాయకులను, దేశోద్ధారణ మొనరింప ముందువకునెట్టి, భరతఖండమును మేలుకొన జెయితట్టి, యింటకవమును విడచిపెట్టి, యేటియొడ్డున గుండెలవియ దిక్కుమాలి చచ్చినది. అట్లుచేయనిచో, రాధ చచ్చియు బతిసేవ యొనరించిన సత్కీర్తి యెట్లుపొందగలదు?

అప్పుడు కృష్ణుఁడేమయ్యెనో! చింతామణికి ప్రత్యక్షమైనప్పుడు రాధయెడల దనకుగలకూర్మి వాగ్రూపమున బ్రదర్శింపదలచి మిన్నకుండెనా! లేక వారిని వీరిని ప్రార్థించుచుండిన రాధ తన్నేదలంచినప్పుడు రక్షింపనగునని యూరకుండఁగా, ఓర్పులేని యా పతివ్రత కాలవ్యవధిలేక మృతించెనా?

చిత్ర - చిన్నపాత్ర. పెంపుడు పరిచారిక. మాటలు గబగబ చెప్పజాలదు. నటులీసంగతి గుఱుతించి సభికులను భాధింపలేదు నయమే. దీనికి సుబ్బిసెట్టితోగల సంబంధమిదివరకే చర్చింపఁబడినది. నిశ్చయము తేలలేదు. ఈపాత్రకు మొదలులేని లోపము చింతామణి తీర్చివేసినది. ఎట్లు? దీనిపెండ్లికొరకు 10 వేల రూప్యములు బ్యాంకీలో వేసినది. లంజకు పెండ్లిబేరమా? రిఫారమ్ పెండ్లి గాబోలు! ఓహో గిరీశంగారూ! మీరిప్పుడెందున్నారు! 10 వేల రూపాయిల కన్యా శుల్కము! గమనమునందు గాక పోయినను భాషించుటయందు మాంద్యముగలిగిన చిన్నది. మధురవాణికంటె చక్కనిదే! గండు! పెండ్లియాడి బాగుపడవచ్చును.

శ్రీహరి (గుడ్లగూబ కరుణా కటాక్ష! షోకేలాడుముదసూర్యోదయ! చుట్టపీక విద్వజ్జనాధార! వక్కమెడ విక్రమార్క! నల్లవందురాధేయ! కల్లుపాకకోలాహల! జయావిభైభవ! దిగ్విభైభవ!) దసరాపద్యములు సార్థకములోనికి దెచ్చిన పాండిత్యము గల చింతామణితల్లి! పలువురశంకరగిరి మన్యము పట్టించిన సమర్ధతగల వేశ్యమాత! 'విటులపాలిటి యమమాత వేశ్యమాత' దీనివయసు విమయమై కొంతసందేహమున్నది. "పెద్ద వయస్సు వచ్చె బుద్ధి పెడతల పట్టెఁ" ఇందువలన చాలయేండ్లు గడచినదే యనవచ్చును. కాని దామోదరుడు చెప్పిన రసకంఠులు మొదలగు కొన్నిటివలన త్వరలో నవయవ పటుత్వము చెడగా పింఛను బుచ్చుకొనినదో యని సంశయముగుచున్నది. కొందరు నటులు లోకలోపము జేసిరి. దామోదరుడేవేళనో దీనిని జూచి అనుచెప్పులు చుట్టపీక మొదలగునవి వర్ణింపగా నెప్పుడు నట్లే యుండునని పొఱపడి యట్లే రంగస్థలమున బ్రవర్తించిరి కానీ నల్లవిగ్గో తెల్లవిగ్గో తేలనేలేదు. ఒక్కఁడటునిటుగా నున్నదానిని ధరించి తప్పించుకొని పోవజూచెనుగాని జయముగాంచక పోయెను. దీనివేషమునకు పతకముండెనుగాన బ్రతికిపోయితిమిగాని లేకున్న ఆఘుంపగలోను చొల్లులో

డీ చింతామణియింటికి గొట్టుకొని పోయెడివారమే! [అనగా నటు లీస్వభావమున నగుణముగ మాటాడలేదని యర్థము.]

8వ ప్రకరణము.

సీ. చింపిరివిగ్గుపై చిత్రవర్ణమ్ముల, పట్టికనొకదాని గుట్టివైచి
అందుపై నొకచిన్న గ్యాసులైటును ధరించి, అప్రక్క నొకబ్రోచి నంటగ్రుచ్చి
రంగమ్మునకు నొక్కపైక జీరయు దాల్చి, గిల్టునగలుకొన్ని గీలుకొల్పి
గొంతుచించుక పాడు చింతమోమున నాడ, సకిలింపు లికిలింపు లొకటినొకటి

గీ. మీరియుండగ నొక్కింపు నారితెలుగు, నడకచందమ్ము లేక పోకడల వగల
మొలకువలు లేక వలపుల సొలుపులేక, నభినయింతురు నటులు బాహ్యార్థగరిమ॥

ఇఁకనున్నది పెద్దమెట్టు! పెదమాళ్ళసేవ! —

శ్రీచింతామణి - నిత్యకళ్యాణి! వేశ్య! కథానాయకురాలు! మేళమునందే గాదు. రూపకమునందును. రూపమునం దని తలంతురేమో. ఎబ్బె! చముదుజిడ్డు మొగంబు పుసికన్నులు. కంపుతోడలు. సీ సీ సీ దొంగముండ. రంగుమెఱుంగు చక్కదనమే నా?

శాంతరసప్రధానమైన పాత్ర! చింతపండురసము కాదా? అంతయు శృంగారరసమే. మధ్యమధ్య చూడవచ్చినవారి కన్నులలో కారము చల్లుటకు కపటశాంతము! పరోముఖవిముఖత్వము. తేనెపూసిన కత్తితనము! విద్వాంసురాలు. [విద్వాంసులు సర్వస్వతంత్రులట! ఎందునకు? తిమ్మని బమ్మిచేయుటకు. కుక్కను గంగగోవు సేయుటకు. ధూర్తచరితలకు నాయికత్వ మిప్పించుటకు. సర్వధర్మసాంకర్య మొనరించుటకును గాబోలు] దీనిని విధ్వంసురాలనుట ధర్మము. (1) శృంగారముతో గలిపి శాంతరసస్వభావమును ధ్వంసముజేసినది. [ఉత్తర దక్షిణధ్రువముల చేరిక!] (2) అలంకరించుటయందలి నేర్పుచేత నిది "ముస్తాబు మెఱుగున రాణింపదె మై 'చిత్రకార్తి కుక్కలంబలె' (ఆహా యెంత యోగ్యమైనపలుకు!) ఆ నేతలకు విటులను చేరదీసి వారి యావదైశ్వర్యమును ధ్వంసపఱచినది. బలే చింతామణి!

శ్రీహరి మాటయేమో కాని యిదిమాత్రము పెంపుడు ముండ కాదు. "నాకడుపున బుట్టితి" వని శ్రీహరియే చెప్పెను గావున "నిందులో నేమాత్రమును కల్తి లేదు." దీని చక్కదనము దొంగచక్కదనమని చివరకు తేలనే తేలినది. ఇఁక బాండిత్యవిషయము. దేనియందు? అనృతములాడి విటులను నమ్మించి గొంతులు కోయుటయందు. ఉదాహరములు. (1) పెద్దిశెట్టి రవ్వలగాజులు తెచ్చియిచ్చుచు నేయున్నాడు. భవానీశంకరునితో వానికి సొమ్ము పెట్టితినన్నది. (2) ఆసెట్టి యుండగనుండియే వానికొడుకైన సుబ్బిసెట్టిని జేరదీసి కీనిరాకవిషయమై భవానీశంకరునితో నబద్ధమాడెను. (3) నానీతికి భంగము రానీ

యనని భవానీశంకరునితో పలికి వానినే గేలముగా నుపయోగించి కపటపాండిత్యమున చే తగిలించి, 40 లక్షలు విలువగల బిల్వమంగళ మీనమును తన దూరదాశలో క్కించి వీనిని 'రెండు చపేటములిచ్చి' భార్యకాళ్లమీదపడి నీళ్లకావడి మోయుటాగున నీడ్చితెచ్చినది. ఎంతతన్నో! ఇదియేగాబోలు, 'ఆ నలువది లక్షలలో సగము నాది సగము నీది' యను పదమున కర్థము! ఇట్టివింక నెన్నియున్నవో! బలే చింతామణి! ఒకవేళ సమస్యాశ్లోకములను రచించినదిగదా! విద్వాంసురాలుగాదా యందురేమో. అదియు విచారింతము.

'నబీజం పూర్ణవృక్షశ్చ । శాఖాపల్లవవర్జితం'
పుష్పం నాస్తి ఫలం నాస్తి । కోవృక్షః పండితోత్తమ॥

'నబీజం' పుంలింగమైన వృక్షశబ్దమునకు చెందినది గావున 'నబీజః' అనవలయును. 'శాఖా-పల్లవవర్జితం' 'వర్జితః' అనియే యుండవలయును. ఈరెంటియందును లింగము చెడినది. ఈ చింతామణి సంఘసంస్కారప్రియ గావున సంస్కృతశబ్ద లింగసంస్కారమునకుగూడ గడంగెనేమో. 'పూర్ణవృక్షశ్చ' 'అబీజః అపి పూర్ణవృక్షః స్యాత్, బీజములేనిదయ్యు పూర్ణవృక్షమగుచున్నదని భావముగాబోలు! కాని 'చ'కారమువలన 'నకారము' పూర్ణవృక్షః ముందు చేరుటచేత భావమును చెడినది. 'పుష్పంనాస్తి ఫలంనాస్తి' ఇవి వృక్షమునకు విశేషణములైన సమాసపదములుగా నుండవలయును. పూర్ణవాక్యములుగా నుండినని. వృక్షముతో నెట్టిసంబంధము? పుష్పములులేవు, ఫలములులేవు, ఏమిచెట్టు? పుష్పములులేనిది ఫలములులేనిది ఏవృక్షము? అన్నబాగు: ఇందన్వయ మర్యాదకూడ చెడినది. 'కోవృక్షః పండితోత్తమ' ఈపాదము దోషగర్హితమే. కలికాలమునందు ధర్మ మేకపాదగమనము గలది కావున, ఈ కవికావ్యమునందు నట్లెసిద్ధించినది గాబోలు! అదిగాక 'మహాకవిప్రయోగములు సాధువులేమో. రెండవశ్లోకము ఘుణాక్షరన్యాయముగా నొకతప్పుతో [మణ్మాసం సాణ్మాసం అనవలయు] కుదిరినది. అయిననీదోషము అచ్చుకూర్పువాని మెడకు జుట్టవచ్చును. కావున నీ చింతామణి దొంగపాండిత్యముగలదియే యనవలసియున్నది. కాని తల్లి పండితురాలుగదా యిదిమాత్రమేల కాఁగూడదందురేమో. ఇందునకు సమాధానములు—

(1) శ్రీహరి 'నాకడపున బుట్టినవన్నమాటయేగాని, నాగుణములలో నొక్కటియు నీకబ్బలేద'నినది. అందు పాండిత్యములేదా?

(2) బట్టువానివలె నాలుగుపద్యములు వదివినంతనే దానిని పెద్దవిద్వాంసురాలనవలయునా? అటులందుమేని నాటుపద్య మణిమంజరి వల్లెవేసినవాడును పండితుడే యగును. నాట్యరంగమునందు నాలుగుసంస్కృత శ్లోకములు పాడినవాఁడు మహాపండితుడే యగును.

ఇఁకనీ ప్రకరణమునందు చింతామణి నాయికత్వ మెట్టిపరివర్తనములుగలదియో విచారింతము.

(1) ఇది యొకనిమాటున నొకనివలచి, తనకాపట్యమును వెల్లడికానిచ్చినదికాదు.

... యు 'అప్రకట పరపురుషానురాగా పరకీయా' అని లక్షణము.

(2) ఇది ధనమునకై యిందర గామించినది. కావున సామాన్య 'విత్తమాత్రోపా కలపురుషానురాగా సామాన్యా'

(3) బిల్వమంగళుని తనకుదార్చి హితమొనరించిన భ॥ శం॥ ను త్రోసివేసినది. అందువలన 'నధమ' 'హితకారిణ్యపిప్రియే (అ) హితకారిణ్యధమా'

(4) ఒకనివెంట నొకనిగా ననేకుల జేరదీసినది కావున ... దీనికిలక్ష్యము.

"ఏతేవారికణాన్ కిరన్తిపురుషాన్ వర్షన్తినామ్భోధరాః। శైలాః శాద్వల ముద్వమన్తి నసృజన్త్యేతే పునర్నాయకాన్। త్రైలోక్యేత్రిదివః ఫలానిసువతే నైవార్థనైవిటాన్। ధాతః కాతరమాలపామికులటా హేతోస్త్వయాకింకృతం" ఓబ్రహ్మదేవుడా! నీబుద్ధి యింతబుగ్గియైనదేమి? ఈ మేఘములు వానచినుకులకు బదులు మగవారిని వర్షించునట్లు న్నా, పర్వతములు గడ్డికప్రోవులకు బదులు నాయకుల నినునట్లును, వృక్షములు కాయలకు మారు విటులను గాచునట్లుగునను జేయవైతివిగదా! యని కులటవాపోవునట! చింతామణియం దీవర్తనములు గోచుటలేదా? ఇన్నివిధముల నాయికాత్వప్రసిద్ధిగలదు గావున నిది 'మహానాయిక'. బలేచింతామణి! సుబ్బిసెట్టికిరెటె నిదియే యదృష్టవంతురాలు!

దీనికి దయాబీజము, భక్తిలవము, పశ్చాత్తాపలేశము - మాహేంద్రోక్షణమునుంపుట చేత, నీశ్వర సాక్షాత్కారము లభించినదట! పాపము! తల్లిబలవంతముచేత నింక వేదు దారింబట్టి చరించుచుండెనట! నిజమే వ్యభిచారవృత్తి నెన్నిమాగలో దూషించినది. అందువలననే దానినెల్లరు విశ్వసించిరి. తుదకు వారదృష్టముచేత చెడిరి. చింతామణి యేమిచేయగలదు. అయిన నిచ్చట నొకప్రశ్న. తల్లియాలమున నిన్నిఘోర పాపము లొనరించినదే, వానిఫలములో నెన్నవవంతు తల్లి పంచుకొననిచ్చగించెనో తెలిసియే యిట్లు నరించెనా? లేక, కర్తయైన తనతోపాటు, కారయితయైన తల్లియు ననుభవించునను నమ్మకముతో నట్లు నరించుచుండెనా? అటుగాక. యీకపట వినయప్రవర్తనము మాటున నిది లోకమున బ్రతిష్ఠ గాంచుట కర్తినయెత్తా? మాయభిప్రాయమున నిదికొంటె యెత్తేయగును. ఎట్లందురాయేమి?

9వ ప్రకరణము.

గీ॥ అమరవిభుఁడెక్కునట్టి సింహాసనమ్ము । భక్తులంద్రోచునట్టి సౌభాగ్యమూర్తి
ఆంధ్రనాటకశ్రేణియు నంతొయింతొ । పరగజింతామణివలన భద్రగతులు॥

బిల్వమంగళుని రావించుటకు చింతామణి కపటపాండిత్యము ప్రకటించెను. నేజెప్పినట్లు చేయుదువేని మనయింటికి రప్పించుభారము నాదియని భవానీశంకరునితో వలికి కపటపాండిత్య భారము వహించినది. మాయాసౌందర్యము. సుబ్బిసెట్టి రాకకు పూర్వము 'అద్దముయెదుట నిలచి అన్నియుసర్దుకొని, అత్తరురాసికొని గుమ్మముయొద్ద నిలచుచున్నది.' ఒకపరి జోరుగాముస్తాబు. చింతామణి! ఇప్పుడు నావేష మెట్లున్నదే.

చిత్ర॥ ముక్కల్లో మూరేడులాగున్నావు. ఇది బిల్వమంగళుని ప్రవేశపు వేషధారణము. ఇంక జాలదా?

మఱియు నీచింతామణి రోజులు మంచివగుటచేత, రెండుసందర్భములు కుదిరి

(1) వ్యామోహముగల బిల్వమంగళుడు, బ్రహ్మంగారి మఠములో నెరవుదెచ్చిన చింతామణి ప్రశ్నలకీవిధమున ప్రత్యుత్తరము లీయఁజాలకపోవుట. ఎట్లనిన —

అన్నిటికంటె చిత్రమైనది కాముకులచిత్తవృత్తి. సుందరమైనది రంగుమెఱుంగుల వేశ్యాముఖము. భయంకరమైనది వేశ్యమాతనొసలు. మనము విడచినను విడువనిది భోగినుల కౌగిలియెడలి యపేక్ష. దేనిచేతను చావనిది, సానియెడలి యనురాగము. ఎట్టి దారిద్ర్యమునందును సుఖపెట్టునది సాని పదస్పర్శ అన్నిటికంటెను బలమైనది, దాని యొరవమాఫు. సులభమైనది ధర్మపత్ని నెడబాయుట. కష్టసాధ్యమైనది పత్నివంక జూచుట. పాపములనెల్ల పరిహరించునది సాని యెడమకాలి చెప్పుచే దెబ్బలుతిని కృష్ణకర్ణామృతశ్లోకములు వల్లెవేయుట. బలే చింతామణీ! నీ కపటపాండిత్య మను నాగాస్త్రమునకు గారుడాస్త్ర ప్రయోగము. దీనినెట్లు తప్పించుకొందువో!

(2) చింతామణి దయచేసిన బహుమానమునకు ప్రతిసేయ దలంచిన బిల్వమంగళునకు నేపథ్యగమన శీలుఁడైన వాసుదేవమూర్తి యడ్డమువచ్చి యాకొరతదీర్చకొనుటకు కొడుకును చింతామణియింటికే పంపివేసెను. ఈనిర్మాణము జరుగనియెడల చింతామణి యెంతకష్టపడవలసి వచ్చెడిదో! ఇదిభగవన్నిర్మాణము గాని కేవల మానవనిర్మాణము గాదు. ఇందు కాలకర్మదోషముచేత చింతామణి సమగ్రత యందొకింత లోపము తటస్థించినది. కాని బలే నేపథ్యరచనాసిద్ధి!

తరువాత కృష్ణసాక్షాత్కారము! వేలకొలది సంవత్సరములు తలక్రిందుగా తపస్సొనరించెడు మౌనులకును లభ్యముగానిది. ఓహో! దయాబీజాదులకు లొంగిపోయినది. ఆహా! సుబ్బిసెట్టి పెసరట్టులకంటె చౌకయైనదిగదా భగవద్దర్శనము! ఈ నాటకము నందు మూలమున 'భోగినీభగవద్విలాసము'న్న సరసముగ నుండెడిది. బుగ్గనవ్రేలిడి నడుమున చేయిడికొని చైత్రకృష్ణుఁడే కలికాలపు తపోయజ్ఞనియమములు గావలయును ఇమ్మహాయజ్ఞమునందు ఋత్విక్కులు మాతికలు, వేశ్యమాత యుపద్రష్ట, ధనముయాజి వేశ్య సోమిదేవి, విటులుయాగపశువులు, క్షేత్రయపదములు మంత్రములు గానాభినయములు యజ్ఞనియమములు కపటభిక్షుము మొదలగునవి ఆహుతిపాత్రములు అపూర్వ కృష్ణసాక్షాత్కారముఫలము ఇదిగో విఘ్నవేణీసంహారము. ఆహా! ఈశ్వరలీలావైచిత్ర్యము!

క్రూరులైన రాక్షసులకు మోక్షమిచ్చిన భగవంతుడు దయాబీజాదులుగలిగి చింతామణి నేలయనుగ్రహింపరాదని ప్రశ్నింపవచ్చును. అట్టిరాక్షసులలో నొకఁడైన ఘంటాసురుని వృత్తాంతము చర్చించిన యీసందేహము దీరిపోవును - ఘంటాసురుఁడు దయాబీజాదులుగూడ లేనివాఁడు. తల్లికోపము నే సహింపజాలని చింతామణివలెగాక చాలసంవత్సరములు తపోనిష్ఠనలుపఁజాలినవాఁడు. ఆతఁడు విష్ణుని పేరువినగూడదని చెవులకు గంటలు కట్టికొనెను. అంగుళములనాతని కేశవనిముఖ విప్పింపలేము. అతఁడు

రుటకై విశ్వమెల్ల సంచరించెను. కావున వానికన్నులనేదియు నాకర్షిం నికరము లాతనిస్పర్శ నాసించెను. చరణములు వానికై సంచరించెను. గారియందే బద్ధమయ్యెను. అట్లు తదేకదీక్షతో హరిని-విరోధభావముతోడ ంచెడు రాక్షసుని బ్రోచుటయు నీ కపట భోగినిని సంరక్షించుటయు నొక్కటియే యగునా? అట్లుగావింపని భస్మాసురుని వానిచేతులతోడనే వాని దగ్ధము చేయలేదా? నిరంతరహరిచరణసరోజసేవా దురంధరుఁడగు ప్రహ్లాదునకుఁగూ నింతసులభముగ హరిసాక్షాత్కారము కాలేదే! అదిగాక యీ వేశ్య ఆనాటి సాయంకాలముననే గుడిమేళముచేసి యెందఱను రంగుజేసి వంచించెనో, యెందరయెదుట మొగ్గవాలి యెన్ని కాసులు ప్రోవుజేసెనో! ఇంతలోనే భగవత్సాక్షాత్కారమా! ఇది విపరీతమే.

అయిన నీవిపరీతమున కర్థమేమందురా? చెప్పెదను శ్రద్ధతో నాకర్ణింపుడు.

బిల్వమంగళుని ధన మీ చింతామణి 90 వంతులు లాగివైచినది. అంతలో వాని తండ్రియు భార్యయు మృతించెను. ఈతం డంతకుపూర్వమే దాని మాయజాల సంతటి వ్యామోహమున నున్నాఁడు. ఈతం డితర విటులబోలినవాఁడు కాఁడు. ఆమిగిలిన ధనమైపోయినపిమ్మట విడిపించుకొనుట కష్టతరము. అతఁడు భార్యచచ్చిన దుఃఖమున నున్నాఁడు. శ్మశానవైరాగ్యము. శృంగారమునకు మగలనెడమీయఁ గూడదు. చింతామణి తనమారెన్నో రూపము చూపించినది. నీకు నరకమని చివాట్లుపెట్టినది. కృష్ణసాక్షాత్కారపు మిష మనస్సునకుఁ దట్టినది కలలో నతడు కన్పించి తన్నుశీలవతిగా నొనరించెనన్నది. అంతలో దానియదృష్టమేమోగాని యిద్దఱు బైరాగి ప్రత్యక్షమైనాఁడు. శాంతరూపమైన చింతామణి తన స్వరూపమైన బైరాగితోఁ బ్రత్యక్షమై, నాయకునియందు నిస్పృహ ప్రతిష్టించి వానికి సన్యాసత్వము ప్రసాదించి యీప్రకరణమును శాంతరస ప్రధానమైనదానిగా నొనరించిరి. ఆబైరాగి వీనిని మఠములోనికి దీసికొనిపోయి (భంగు ద్రావించి గాబోలు) పరమయోగీశ్వరు నొనరించెను. ఇంతలో చింతామణి తాను శీలవతియైనట్లు నటించుచు, [నటనయనుటకు ఉదాహరణము:—తాను సంపాదించిన ధనముండగా సుబ్బిసెట్టి బాకీలు,-బిల్వమంగళుడు చింతామణి జాలిగుండెగలది యనుకొనుటకు - వానిడబ్బుచేతనే దీర్పించెను [పాపము ఇంటిలో యిసుపపెట్టె తాళపుచెవులు తల్లిస్వాధీనమున నుండునుగాబోలు] కొన్నిదానములు ప్రకటించి శ్రీవారికి పిచ్చియెత్తెనని చాటించి-పెట్టెముండ చిత్రయున్నదిగదా టమటమా వేయుటకు-దానిచేతనే సుబ్బిసెట్టిని, భవానీశంకరుని వెదకించి, పట్టించి వారికి ఆరునెలల పిమ్మట కొంతడబ్బిచ్చెదనని ఆసపెట్టి వారిచేత నిన్నివాగించి, తానిన్ని ప్రేలి - తనపూర్వ వృత్తమును ఆపురమునందితరులకు జెప్పెడువారు లేకుండులాగున - వారిని దేశాటనము సేయబంచి పూర్వము తాను వల్లెవేసిన కృష్ణకర్ణామృత శ్లోకములను పాడుకొనుచు వచ్చిన ఈ క్రొత్తపింగు కాషాయపు బిల్వమంగళుని మధురానగరము జేరబంచి టింగురంగాయని తాను పూర్వార్జితమైన మామిడితోట మాగాణములు, 40 లక్షలు ననుభవించుచు, మఱికొందర విటులను కోనేటి మేడయందున, మూడంతస్తుల క్రొత్తమేడయందును నిలుపజేసికొనుచు

పోయిన వారితో కాలము గడపుకొనుచున్నది. [ఈచివరభాగ మీనాప్రవేశయోగ్య రాదు. 10 యంకములును ముందేపూర్తి యయ్యెనుగదా.] ఈచరిత్ర వి విషయములు ఇందలి పాత్రముల వ్యాపార సంబంధములవలన దెలియవచ్చుచున్నవి కుదిసి గాని యీ బిల్వమంగళుఁడా కృష్ణకర్ణామృతమును రచించిన యాతఁడును నరవుదెళ్ళి కల ప్రథమ శ్లోకమునందలి చింతామణి యీచెడిపడుచుఁగాదు. ఇయ్యది సలక్షణమైన ప్రకరణమునుగాదు. ఇందలి ముఖ్యరసము శాంతమునుగాదు, మ ఓదియునుగాదు. ఇది మహాకవికృతమును గానేరదు. ఓ మహాకవి బిరుదమా! నీవు కాళిదాసాదులతో దివికేగఁజాలక ఈరసాపకర్ష ప్రపంచమునంబడి చిందవందర యగుచున్నావుగదా. ఓశాంతరసమా. నీవుసత్పురుషులను విడచి ఈగంజాయి బైరాగులపాలయి గూపు చెడియున్నావుగదా!

10వ ప్రకరణము.

గీ॥ ప్రకరణంబు విమర్శించు పట్ల దీన। ప్రకరణంబులు పదియును వ్రాయనయ్యె,
ప్రతిరయిలునందు బ్రతియింటి బ్రతిముఖమున। నెమ్మినిద్దియె యెప్డుబ్రతిధ్వనించుగాక॥

అయిన నిట్టిరూపకము నింతశ్రద్ధతో నేల చదువవలసె నందురేమో. పరీక్షార్థమై వచ్చిన వటులే తగినంతశ్రద్ధతో చదువనప్పుడు పరులకేమి యవసరము? కాని మహామహులైన ఆంధ్రనాటకపరీక్షాకార్యస్థానమువారు దీనిని పరీక్షాపఠనీయగ్రంథముగ నియమించుటయు, నీయేడు పరీక్షాపదర్శనములు-నుచితముగనే-వీక్షించుటయు దటస్థించుటవలన నిందలి లోపములన్నియు, భూతలద్దమునందువలె పొడగట్టుగా నిట్లు వివరింపవలసి వచ్చెను. అదియుగాక యిదిమహాకవి విరచితమైన ప్రథమాంధ్ర ప్రకరణమని ప్రచురింపబడి యుండుటయు నీవిమర్శకుం గతమనియు నెఱుంగవగును. కాకుండిన నీబాధయే లేకుండెడిది.

ఈప్రకరణమువలన లోకమునకు దెలియు విషయములు మూడు

1. నాథునను రాగము వడయనియెడల మహాపతివ్రతకును బలవన్మరణ సిద్ధము. ఈశ్వరుఁడడ్డుపడఁడు.

2. ఎట్టి చెడిపయైనను దయాలేశాదులవలన నీశ్వరానుగ్రహము వడసి పాపముక్తిగాంచి, మోక్షరాజ్యమున పెద్దపీటపై గూర్చుండఁజాలును.

3. అట్టివేశ్యలఁ జేపట్టెడు విటులు చివరకు పూర్వవైభవము (మరల నొక వెలుగు వెలుగుటకు) యథాప్రకారము వడయఁగలరు.

ఇట్టి దుర్నీతి బోధించుననియే లక్షణవేత్తలును, రసజ్ఞులును నీచపాత్రములకు ముఖ్యస్థాన మొసంగరు. ఇందలి యాథార్థ్యములను మృచ్ఛకటికము మొదలగు సంస్కృత ప్రకరణముల జదివి యెఱుంగనగును.

—§ ఉ ప సం హా ర ము §—

డ నభిమానము గలవార లీవిమర్శకులగల కారణమునెడ సందేహము తుణనిర్ణేతలు ప్రకృతికిని కళకును మధ్యవర్తులు. వీరి మాధ్యస్థమును నిరసించుట ప్రకృతిధర్మమును నిరసించుటయే యగును. పద్యగద్యములను రచించుట యందు, తల్లక్షణము లనుసరించుచు రూపకనిర్మాణమునందు మాత్ర మట్టిదేయగు లక్షణమును త్రోసిపుచ్చుట కేదేని ప్రబలకారణము లేకపోలేదు. అదెద్దియన సాధారణ విద్యాసంపర్కమువలన లభ్యమైన కవిత్వధార రూపకరచనయందు మాత్ర ముపయోగపడుచున్నది. అట్టిసిద్ధియందీ నాట్యనాటక లక్షణము స్వకపోల కల్పనాసిద్ధికి కొండవలె నడ్డమువచ్చునేమో యనభీతియే. మఱొండు కారణము గానుపింపదు. అట్లైన వీరెల్లరును లక్షణగ్రంథములేల పఠింపరాదు? శ్రమపడవలయును గదా. అదియటులుండ మఱియొక్క విశేషము. హిందువులకు పురాణకథలయెడ నభిమానము మెండు. మఱియు నిప్పటిదురాచారములను విమర్శించు నిచ్ఛయు నధికము. అందువలన పురాణకథలను ప్రస్తుతాంశములతో కలిపి రూపకములు రచించెడు విపరీతమునకు కవులు గడంగుచున్నారు. అది సమంజసముగాదు. నాటకములుపది. నాటికలు పదునెనిమిది. ఈ యిరువదియెనిమిదియు మఱికొన్ని యంతర్భాగములతో నేబదియో యఱువదియో యగును. వీని లక్షణము గమనించిన నేవిధమైన రూపకమును రచింపదలంచిన నట్టిదానికి వీలు గలదు. రూపకనిర్మాణమునెడ నభిలాషగలవారు వీనిని గ్రహింతురుగాక.

గీ॥ లక్ష్యలక్షణశుద్ధి విలాస మెసఁగ । కవులు దృశ్యముల్ రచియింత్రుగాక - నటులు
భావము, రసమ్ము నభినయ పద్ధతులను । దెలిసి రంగస్థలమున వర్తింత్రుగాక॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ప్రదర్శనములన్నియు సాంతముగా జూచియుండనందువలన పరీక్షాఫలితములంగూడ విమర్శించుట మాకు విధియని యీభాగముంగూడ దీర్చి వేయుచున్నాము.

బిల్వమంగళ పాత్రము నొకపండితుడు రసవంతముగ ప్రదర్శించి స్వాతంత్ర్యముచేత నపజయము గాంచెను. ఇందువలన పండితులకు తలవంపు ఘటిల్లెను. ఏమన, నాటకగ్రంథకర్తలు తమ యిచ్చవచ్చినట్లు రూపకములు రచింపవచ్చును గాని, పండితులైనటు లారూపకముల ప్రదర్శింపుచో నట్టిస్వేచ్ఛ యుపయోగింపరాదట. విద్వాంసులు సర్వస్వతంత్రులన్న మహాకవి పలుకిం దన్వర్థమాయెంగదా!

ఈపరీక్షయందు జయముగాంచిన నటులు మూడుతెఱంగుల నున్నారు.

[అ] కొంచ మెచ్చుతగ్గుగ సమానులయ్యు నదృష్టముచే జయించినవారు.

(1) రామమోహనువారి బిల్వమంగళుడు, ఆంధ్రనాటక సమాజపు బిల్వమంగళుడు వీరితో సమానుడేగాని, యాతని ప్రదర్శనము పరీక్షాధికారులందఱును వీక్షింప

లేదు. ఈతని రసప్రదర్శనము జయించినవాని రసప్రదర్శనముక ప్రవేశము సౌమ్యముగానున్నది. సామాన్యదృష్టి కీభేదము స్ఫురింపకపోవచ్చు ...లు కుదిర...

(2) బెజవాడ భవానీశంకరుడు- సౌమ్యరసప్రదర్శనముచే జ... సమానుడైన కాకినాడ నటుడు గానరసమునందు మిగిలినవానిని ము... నెరవుడెచ్చి ... రాజమండ్రి నటుని ప్రదర్శనము త్వరచేత గొంత లోపపడియెను.

(ఇ) చాలలెస్స యనిపించుకొని జయము గాంచినవారు —

(1) రామమోహను గాథ - చివర రాద్ధాంతవచనమునం దొకింత పురుషత్వము వహించెనుగాని చాల రసవంతముగ బ్రదర్శించెను.

(2) బెజవాడవారి సుబ్బిసెట్టి - ఈనటుడు కొంత జంకినట్లు కన్పించెనుగాని మొత్తముమీద చాల నిపుణత జెఱపెను.

(ఈ) ప్రదర్శనమునందు చాల లోపముండినను కేవల మదృష్టము వలననే జయమ గాంచినవారు.

(1) రామమోహనువారి దామోదరుడు "వద్దుగాబాబూ" గ్రంథకర్త. ఈనటుడు గానరసమునే ప్రదర్శించెను. ఇంతకంటె బెజవాడ నటుని ప్రదర్శనము అధికముగ నుండెను. కాకినాడ నటుడు బాలుడయ్యు జయము గాంచదగిన వాడనిపించుకొనెను.

(2) రాజమండ్రివారి శ్రీహరియు, కృష్ణుడును వీరిజయము పరీక్షాసాగస్యమును సంపూర్ణముగ జెడగొట్టెను. లెస్సయనిపించుకొనిన వారిలో మూడవాడైన ఆంధ్రనాటకసమాజపు శ్రీహరి జడ్జీల పొరపులోపముచేతనే అపజయము గాంచెను. ఇందున కెవరుత్తరవాదులు? తరువాత కాకినాడవారి కృష్ణుడు ముద్దులుమూటగట్టులాగున ప్రదర్శించెను.

(2) మొత్తముమీద రాదగిన "కప్పు" రామమోహనువారు జయముగాంచిరి. బెజవాడవారు నాటకమును ఈడికలేకయు, ప్రవేశనిష్క్రమణ దోషములు లేకయు ప్రదర్శించిరి. కాని ప్రయోజనము గలుగకపోయెను.

చింతామణి పాత్రప్రదర్శనమునకు ప్రత్యేకగౌరవము కాకినాడ నటునకొసంగనయ్యెను. ఆనటుడు కులటాశృంగారమును అసారప్రతిభతో ప్రదర్శించి జయముగాంచెను వానిజయము ప్రకటనాసమయమున బంచిపెట్టబడిన రూపపత్రములవలననే సూచనామాత్రముగ గ్రహింప వీలయ్యెను.



ఈ. యస్. టి. సరస్వతి వెంకటరామశాస్త్రి

జాతివిభాగదర్పణము

ప్రవ. మొం భి [illegible] ములు కుదిస నెరవుదెశో

ప్రథమభాగము — వెల. రు 0 8-0.

వర్ణవ్యవస్థ — వెల 0-4 0

ఇందు [illegible] గల నాలుగు జాతులయొక్క పుట్టుకను గూర్చి [illegible] శాస్త్ర [illegible] ప్రమాణములతో [illegible] వర్ణించి వ్రాయబడినది.

[illegible]

3 భాగములు — భాగము 1కి రు 0 2 0.

[illegible] మంజరము ...... రు 0 4 0

[illegible]

శాశ్వత పోషకులకు రు 12-0-0	[illegible] దారులకు రు 3 0 0
[illegible]కులకు రు 6 0-0	ఆరుమాసములకు రు 2 0 0

ఉత్త[illegible]బోధి.

ఒకప్పు, అనేకములగు, [illegible] గల కాలమున ప్రబుద్ధ [illegible] నాటకము [illegible] బద్ధమైన [illegible] చిత్రించుచు [illegible] సంచరించుచు, [illegible] చిత్తశోధ [illegible] నాతని [illegible] యానందించి, [illegible] వర్ణింపబడెను.

— § పత్రికాభిప్రాయములు § —

గోదావరి పత్రిక. (? 8 20).. [illegible] వ్రాసిన [illegible] ములును, భావబోధకములును, [illegible] మనస్సునకు [illegible] రసాత్మకములుగ నున్నవి

ఆంధ్రపత్రిక (17 8 20) [illegible] ప్రదర్శనము [illegible] గా యున్నది.

వెల రు 0—2—0 పోస్టేజి ప్రత్యేకము.

బుక్కపట్నం తిరుమల రాఘవాచార్యులు,

ప్రొప్రైటర్, బెజవాడ.

15269